క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : మండలంలోని హజారిగూడెం సబ్ స్టేషన్ 33/11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ధనరాజ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హజారిగూడెం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33/11 కేవీ లైన్ పీటీఆర్ మెయింటెనెన్స్ వర్క్ ఉన్న కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో హజారిగూడెం, అలీనగర్, చల్మారెడ్డిగూడెం, కొట్టాల, వెంకట్‌నగర్, నాయుడుపాలెం ప్రాంతాలకు ఉదయం 11.00గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గృహ, వాణిజ్య, వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పశు సంవర్ధక శాఖ ఏడీగా పశువైద్యాధికారికి ప్రమోషన్


ధనలక్ష్మి

చందంపేట : మండల పశువైద్యాధికారి ధనలక్ష్మి పశుసంవర్ధ శాఖ ఏడీగా ప్రమోషన్ పొందారు. మండలంలో విధులు నిర్వర్తించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. తన విధి నిర్వాహణలో సహకరించిన సిబ్బంది, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేశ్


బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్

దేవరకొండ : దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుంకరి రమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రమోషన్‌పై ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా స్థానిక బాలికల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించారు.

డిండి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శ్రీనివాస్‌గౌడ్



డిండి : మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా హన్మంతు శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డిండి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆంజనేయులు కలెక్టరేట్‌కు వెళ్లడంతో దేవరకొండ డీటీ సీఎస్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ డిండికి ఎఫ్‌ఏసీ తహసీల్దార్‌గా వచ్చారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలంలోని బి. అన్నారం గ్రామానికి చెందిన కాతోజు అరుణకు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.13,500 చెక్కు మంజూరైంది. మంగళవారం ఆ చెక్కును బాధితురాలికి బీఆర్ఎస్ యువజన నేత కాతోజ్ వినోద్‌కుమార్ అందజేశారు

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

పెద్దఅడిశర్లపల్లి : గ్రామాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని దేవరకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని తిరుమలగిరిలో వనమహోత్సవంలో భాగంగా సుమారు 300 ఈత మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అటవి సంపద పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, రైతులు తదితరులున్నారు.

పీఆర్‌సీ ప్రకటించాలి

నల్లగొండ టూటౌన్ : పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి ఉద్యోగులతోపాటు పెన్షనర్లకు పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డీఆర్ ఇవ్వాలని, అన్ని ఆస్పత్రుల్లో హెల్త్‌కార్డులతో క్యాష్‌లెస్ వైద్యం అందించాలని కోరారు. అనంతరం ఏఓ మోతీలాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గోవర్దన్, కోశాధికారి ఎండీ.అబ్దుల్‌ఖాదర్, భిక్షమయ్య, వెంకటేశం ఉన్నారు.

పాఠశాలలకు ప్రహరీ నిర్మించరూ..

- ప్రభుత్వ బడులకు రక్షణ కరువు
- ఆవరణలోకి పందులు, పశువులు, పాములు రాక
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


ప్రహరీ లేకుండా ఉన్న చింతచెట్టు తండా ప్రాథమిక పాఠశాల


బంగారుకుంటతండా ప్రాథమిక పాఠశాలకు..

అడవిదేవులపల్లి : ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రక్షణ పూర్తిగా కరువైంది. పలు పాఠశాలలకు రెండు వైపులా పంట చేలు ఉండటంతో విషపు పురుగులు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రహరీలు లేకపోవడంతో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మండలంలో ఒక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు 14 ప్రాథమిక 4 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. అదే విధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో మొత్తం 644మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

పొలాల నడుమ పాఠశాల

మండల కేంద్ర శివారులోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో 235 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రహరీ లేక వారు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. గ్రామానికి దూరంగా ఉన్న ఈ పాఠశాలకు రెండు వైపులా పంట చేలు, మరోవైపు రహదారి ఉండటంతో విషపు పురుగులతో పాటు విద్యార్థినులకు ఆకతాయిల నుంచి ప్రమాదం పొంచి ఉంది.అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రహరీలను నిర్మించేలా చూడాలని కోరుతున్నారు. అలాగే చింతచెట్టు తండా ప్రాథమిక పాఠశాల ఇళ్ల మధ్యలో ఉంది. ఏళ్లు గడస్తున్నా ప్రహరీ నిర్మాణానికి నోచుకోలేదు.ఆ వరణలోకి కుక్కలు, పందులు, పశువులు వస్తున్నాయి. బంగారుకుంట తండాలో ప్రభుత్వ పాఠశాలకు ఒక వైపు రోడ్డు ఉండగా మరో వైపు పంట పొలాలు ఉన్నాయి. గతంలో ఈ పాఠశాలకు ప్రహరీ ఉన్నప్పటికీ రెండేళ్ల క్రితం పాఠశాల ఆవరణలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించేందుకు ప్రహరీని కూల్చివేశారు. దీంతో రాత్రి వేళల్లో ఈ పాఠశాలలో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ప్రహరీ నిర్మించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతన్నారు. నందికొండ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రహరీ పాక్షికంగా కూలింది. దీంతో ఆ పాఠశాలలోని పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన ప్రహరీ ఎప్పుడు కూలుతోందనని ఆందోళనకు గురువుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ లేని విషయం ఉన్నతాధికారులకు నివేదించా. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి.

\- వరలక్ష్మి, ఎంఈఓ

విద్యార్థుల భోజనంపై నిర్లక్ష్యం వహించొద్దు


భవితకేంద్రంలో దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్


కేజీబీవీలో విద్యార్థినులకు బోర్డుపై లెక్కలు వేస్తున్న కలెక్టర్

గుర్రంపోడు : కేజీబీవీలు, వసతిగృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలో కేజీబీవీ, భవిత విద్యాకేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న భోజన విషయంలో నాణ్యతతోపాటు పరిశుభ్రతను పాటించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కేజీబీవీలో వంటగది, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. భోజనం, పారిశుద్ధ్యం రెండు అంశాలపై పూర్తి శ్రద్ధ, నిబద్ధతతో పనిచేయాలని, వంట గదులు, డైనింగ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులకు బోర్డుపై లెక్కలు వేసి సమాధానాలు రాబట్టారు. బహుపది అంటే ఏంటని ప్రశ్నించి, ఇతర గణిత అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు హోంవర్క్ ఇచ్చి మళ్లీ వచ్చేటప్పటికీ అందరూ రాసి చూపించాలన్నారు. అంతకు ముందు భవిత విద్యాకేంద్రాన్ని పరిశీలించి ఇటీవల ప్రభుత్వం సరఫరా చేసిన ఆటవస్తువులు, ఇతర సామగ్రి పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌లో కేంద్రం ఇన్‌చార్జ్‌గా సంతకాలు చేశారు. దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించి మమేకమై ఆటవస్తువులతో వారు ఏ విధంగా ఆడుకుంటున్నదీ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతిపై వచ్చిన దరఖాస్తుల వివరాలు పరిశీలించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి బి.భిక్షపతి, జిల్లా ఉద్యానవనశాఖాధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మంజుల, ఎంఈఓ యాదగిరి, కేజీబీవీ ఎస్‌ఓ విజయశ్రీ, ఏఈ రవికుమార్ ఉన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

దేవరకొండ : సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఆయా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాలతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడంతోపాటు వంటశాల, కూరగాయలు నిల్వ చేసే ప్రదేశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఎప్పటికప్పుడు వసతి గృహాల్లో వసతి పొందుతున్న విద్యార్థులపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. వార్డెన్లు స్థానికంగా అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో వార్డెన్లు, ప్రిన్సిపాల్స్ ఉన్నారు.

పెండింగ్ డీఏల విడుదలకు కృషి


హాలియా : చింతగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో సభ్యత్వాలు అందజేస్తున్న పీఆర్‌టీయూ నేతలు


గుర్రంపోడు : మోడల్ స్కూల్‌లో సభ్యత్వాలు అందజేస్తున్న నారాయణ రెడ్డి


పెద్దవూర : సభ్యత్వ నమోదులో పాల్గొన్న పీఆర్‌టీయూ నేతలు

పెద్దవూర : పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదలకు పీఆర్‌టీయూ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలోనే ఉపాధ్యాయులకు ప్రమోషన్ల కల్పనకు, కేజీబీవీల టైం టేబుల్‌లో మార్పునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదులో పీఆర్‌టీయూ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తరి రాములు, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, వడ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇరుమాది పాపిరెడ్డి, దుర్గాప్రసాద్, నాయకులు మేదరి దేవేందర్, గవ్వ హిమవంతరెడ్డి, నజీముద్దీన్, దండ వీరారెడ్డి, లక్ష్మీప్రభ, రామ్మూర్తి, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హాలియా : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం శ్రమిస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం అనుముల మండలంలోని చింతగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ అనుముల మండల అధ్యక్ష, కార్యదర్శులు మంచికంటి మధు, చెన్ను వెంకట్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొల్లు శ్రీనివాస్‌రెడ్డి, మందా సైదులు రావు గౌతమ్, వెంకట్‌రెడ్డి, సుబ్బారావు, వేమారెడ్డి, సాజిద్, ప్రకాశ్, అహ్మద్, మేగావత్ లోక్‌నాథ్, వద్యా నోవా, శివప్రసాద్, కుంచం హరిర్షన్, చల్లా వెంకట్‌రెడ్డి, జంగాల సైదులు, ముజీబ్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు అండగా పీఆర్‌టీయూ

గుర్రంపోడు : మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే బాధ్యత పీఆర్‌టీయూదేనని ఆ సంఘ రాష్ట్ర నాయకుడు, పత్రికా ఉపసంపాదకుడు కాశం నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం గుర్రంపోడులోని మోడల్ స్కూల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని అయన ప్రాంరభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జానారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాశం శ్రీని వాస్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు ఎండీ గౌస్‌మెయినుద్దీన్, వి. మధుసూదన్ రెడ్డి, కందిమల్ల కృష్ణారెడ్డి, తిరుమల్ రావు, నరేందర్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

మిర్యాలగూడ : ఇంకుడు గుంతల నిర్మాణంతో గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం అమలవుతుందని ఎంపీడీఓ శేషగిరి శర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 48 గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.44.16లక్షలు మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. ఒక్కొక్క ఇంకుడు గుంత నిర్మాణం అంచనా విలువ కొలతలను బట్టి సుమారు రూ.92వేలు ఉంటుందని, అందులో 70శాతం స్వచ్ఛభారత్ మిషన్ నిదులు, 15వ ఆర్థిక సంఘం గ్రామపంచాయతీ నిధుల ద్వారా చెల్లించనున్నట్లు తెలిపారు. త్వరలో నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ హైదలాపురంలో అమృత్ 2.0 పథకంలో చేపడుతున్న పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఆదే విధంగా వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు ఎండీ ఇబ్రహీం, మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఏఈ నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, పర్యావరణ ఇంజనీరు శ్వేతారెడ్డి తదితరులున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి వ్యసనపరులు

తిరుమలగిరి (నాగార్జునాసాగర్) : మండలకేంద్రంలో పలువురు యువకులు గంజాయి సేవిస్తున్న విషయం పోలీసులకు సమాచారం అందగా కొద్ది రోజుల నుంచి నిఘా ఉంచారు. రెండు రోజుల కింద పోలీసులు పక్కా సమాచారంతో ఇద్దరు యువకులుఎగంజాయి సేవిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినట్లు తెలిసింది. పట్టుబడిన యువకులను తమదైన శైలిలో విచారించారు. ఆ సమాచారంతో మంగళవారం మరో నలుగురికి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : నిబంధనలకు విరుద్ధంగా నడిపే ద్విచక్రవాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)కు వినతిపత్ర అందజేశారు. ఓలా, ఉబేర్, రాపిడోల పేరుతో ద్విచక్రవాహనదారులు ప్రయాణికులను తమ గమ్యాలకు చేర్చొద్దని వినతిలో పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విమర్శలు మానుకొని పాలనపై దృష్టిపెట్టాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షనాయకులపై విమర్శలు మానుకొని పరిపాలనపై దృష్టిపెట్టాలని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌కు కంచుకోట నల్లగొండ అని బీరాలు పలికిన రేవంత్‌రెడ్డి 2018లో కాంగ్రెస్‌కు ఒక్క సీటే వచ్చిందని, 11 స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకున్న విషయాన్ని మరిచారా అని గుర్తు చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలి

మిర్యాలగూడ టౌన్ : రజకులకు ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని తీసుకొచ్చి పూర్తి స్థాయిలో అమలు చేయాలని రజక సంఘం సీనియర్ నేతలు బాసాని గిరి, నల్లగంతుల నాగభూషణం అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులోని మహాత్మాజ్యోతి బా పూలే బీసీ భవనంలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. అదే విధంగా మిర్యాలగూడ పట్టణ రజక సంఘం కమిటీని రద్దు చేసినట్లు తెలిపారు. ఆగస్టు 5న సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకొనున్నట్లు తెలిపారు. ఈ సంఘం రాజకీయాలకు అతీతతంగా ఉంటుందన్నారు. ఈ సమావేశానికి రజకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎర్రబెల్లి దుర్గయ్య, జంజిరాల నాగరాజు, ఖమ్మంపాటి సైదులు, యాదగిరిఇ, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన


వైద్యులతో మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ

దేవరకొండ : దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం డీటీడబ్ల్యూఓ ఛత్రునాయక్ సందర్శించారు. సోమవారం అస్వస్థతకు గురైన విద్యార్థులకు అందించిన వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వంటగదిని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వసతి గృహంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను సందర్శించి అక్కడి వైద్యులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ డానియల్, వార్డెన్ వేలాద్రి ఉన్నారు.

క్రీడాకారులకు గెలుపోటములు సహజం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

హాలియా : క్రీడాకారులకు గెలుపోటములు సహజమేనని, వాటిని సమానంగా స్వీకరించాలని హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు దివంగత షేక్ జావీద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బాలబాలికలకు నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదువుకొని మంచి పౌరులుగా తయారు కావాలన్నారు. అనంతరం కబడ్డీ పోటీల్లో గెలుపొందిన కస్తూరి బా గాంధీ బాలిక జట్లకు ప్రథమ బహుమతి, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు ద్వితీయ బహుమతి, బాలుర విభాగంలో ప్రథమ బహుమతి గెలుపొందిన జెడ్పీహెచ్ఎస్ హాలియా విద్యార్థుల జట్టుకు, ద్వితీయ బహుమతి పొందిన ఆకాంక్ష హైస్కూల్ జట్టుకు, తృతీయ బహుమతి పొందిన లక్ష్య స్కూల్ జట్టుకు, నాల్గో బహుమతి టైం స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ ప్రధానోపధ్యాయురాలు శైలజ, పీడీ వెంకట్రామ్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ డొమినిక్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, చంద్రశేఖర్, యడవెల్లి రాంబాబు, మంగ్యానాయక్, రమేష్, రవి, అనిల్, చంద్రశేఖర్, రాము, గురుకుల పాఠశాల పీఈటీ కనకదుర్గ, కేజీబీవీ పాఠశాల పీఈటీ మంగ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నిడమనూరు : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, కేజీబీవీలలో మధ్యాహ్న భోజనాన్ని, భవిత కేంద్రాన్ని జిల్లా మహిళా సంక్షేమాధికారి, మండలం ప్రత్యేకాధికారి కేవీ కృష్ణవేణి, ఎంఈఓ ఎల్ వెంకన్న పరిశీలించారు. నిడమనూరు ప్రాథమిక పాఠశాలలో మరింత మెరుగైన నాణ్యమైన భోజనాన్ని అందించేవిధంగా చూడాలని ఏజెన్సీని ఆదేశించారు. ఉపాధ్యాయులు కూడా నాణ్యమైన భోజనాన్ని అందించేవిధంగా చూడాలని ప్రత్యేకాధికారి కృష్ణవేణి సూచించారు. కేజీబీవీలో డైనింగ్ హాల్, కిచెన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. బాలికలకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనుకుమార్, కస్తూర్బా ప్రత్యేకాధికారి పద్మారాణి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.


కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ప్రత్యేకాధికారి కృష్ణవేణి

ఘనంగా సీత్లా భవాని పండుగ


అడవిదేవులపల్లి : బంగారుకుంట తండాలో పూజలు చేస్తున్న గిరిజన మహిళలు


మిర్యాలగూడ టౌన్ : లావూడితండాలో..

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని లావుడి తండాలో సీత్లా భవాని, ఏడుగురు అమ్మవార్లను మంగళవారం గిరిజనులు పూజించారు. తండా వాసులు నూతన వస్త్రాలను ధరించి అమ్మవార్ల వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శ్రీహరి, ప్రకాశ్, మంగ్త, సేవ, హతిరామ్, బిచ్య ఉన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని బంగారుకుంట తండాలో మంగళవారం సీత్లా పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగ, లక్ష్మి, బాలి, సరోజ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం


విరాళం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు గోవింద్ యాదవ్

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేటతండాలో నూతనంగా నిర్మిస్తున్న తుల్జా భవాని ఆలయానికి అంగడిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు బొల్లు గోవింద్‌యాదవ్ రూ.50 వేలు విరాళంగా ఆలయ నిర్మాణ కర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలతో దైవచింతనతో మానసిక ప్రశాతంత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్తలు రమావత్ చిరంజీవి, స్వామి, జగన్‌రామ్, రాంచంద్, మునినాయక్ తదితరులున్నారు.

'సహకార' స్లాబ్ పెచ్చులూడుతోంది


పెచ్చులూడిన సహకార సంఘం కార్యాలయ స్లాబ్

మిర్యాలగూడ : పట్టణంలోని ఎంపీడీఓ ఆఫీస్‌లో నిర్వహిస్తున్న సహకార సంఘం కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. కొన్నిరోజులుగా స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో అందులో పనిచేస్తున్న సిబ్బంది భయం భయంగా గడుపుతున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. పెను ప్రమాదం జరగకముందే కార్యాలయ భవనానికి మరమ్మతులైనా చేయాలని, లేదంటే తొలగించి కొత్త స్లాబ్ వేయాలని సిబ్బంది కోరుతున్నారు.